ప్రజాశక్తి

మంగళవారం 29 జూలై, 2025 5

శ్రీకాకుళం



1 నుంచి ఆటో మ్యుటేషన్ విధానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఇల్లు, ఖాళీ స్థలాల కొనుగోలు, విక్రయాల తర్వాత పన్ను పేరు మార్పు ఇకపై ఆటో మ్యుటేషన్‌గా జరిగే విధంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ బి.వి.డి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి నగరపాలక సంస్థ పరిధిలో, విలీన పంచాయతీల్లో ఈ విధానం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఇంటి రిజిస్ట్రేషన్ సమయంలోనే పేరు మార్పు కూడా తటస్థంగా నమోదవుతుందని, వేరేగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. విజయవాడలో ప్రయోగాత్మకంగా విజయవంతమైన ఈ విధానాన్ని రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ సంస్థల్లో అమలు చేయగా, అందులో శ్రీకాకుళం కూడా ఉందని తెలిపారు.

అదంతా డిఇఒ డ్రామా

- మాస్ కాపీయింగ్ అవాస్తవం
- విచారణాధికారికి ఉపాధ్యాయ సంఘాల వాంగ్మూలం



విచారణ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో పదో తరగతి పరీక్షల సమయంలో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారని, ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సొమ్ములు వసూలు చేసి ఉపాధ్యాయులకు లంచాలు ఇచ్చారనేది జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య ఆడిన డ్రామా అని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 14 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది సస్పెన్షన్, ఐదుగురు విద్యార్థులు డిబార్ చేసిన ఘటనపై డిఇఒ తిరుమల చైతన్యపై వచ్చిన ఫిర్యాదు మేరకు నగరంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో విచారణ అధికారి, డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.వి శ్రీనివాసులు రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎనిమిది ప్రశ్నలను విచారణ అధికారి యూనియన్ నేతల ముందుంచారు. దీనికి ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు చౌదరి రవీంద్ర, మజ్జి మదన్మోహన్, తంగి మురళీమోహన్, ఎస్.వి రమణ, జి.వి రమణ, ఎస్.రమేష్ లిఖితపూర్వక వాంగ్మూలం ఇచ్చారు. ఏ పరీక్షా కేంద్రంలో అయితే మాల్‌ప్రాక్టీసింగ్ జరిగిందని డిఇఒ పేర్కొన్నారో, అదే పరీక్షా కేంద్రాన్ని ప్రశ్నాపత్రం ఇవ్వడానికి ముందు అరగంట పాటు ఎచ్చెర్ల ఎంఇఒ-2 రాజ్‌కిశోర్ ప్రతి అంగుళం పరిశీలించారని, ఆయన కేంద్రం నుంచి బయటకు వెళ్లిన వెంటనే డిఇఒను పిలిచి పెద్దఎత్తున కాపీయింగ్ జరిగినట్లు బొంబాట్ చేశారని, ఇందుకోసం కొందరు మహిళలను రంగంలోకి దించారని చెప్పారు. పరీక్షా కేంద్రంలో దొరికాయని చెప్తున్న స్లిప్పులకు, ప్రశ్నాపత్రానికి సంబంధం లేదని, ఇన్విజిలేటర్ సంతకం లేకుండా ఉద్దేశపూర్వకంగా డిబార్ చేయడం అశాస్త్రీయమని తెలిపారు. బుడగట్లపాలెం, కొయ్యాం పాఠశాల ప్రధానోపాధ్యాయులను డిఇఒ పిలిపించుకొని కుప్పిలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్ కిశోర్‌కు డబ్బులిచ్చామని బలవంతంగా స్టేట్‌మెంట్లు రాయించుకున్నారని సంబంధిత ప్రధానోపాధ్యాయులు విచారణాధికారికి రాసిచ్చారు. సుమారు 20 మంది అధికారులు ఒక పరీక్షా కేంద్రంలో హల్‌చల్ చేయించి, గంటన్నర పాటు గందరగోళం సృష్టించారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంతో సంబంధం లేని వ్యక్తులనూ సస్పెండ్ చేశారని తెలిపారు. ఇవి కాకుండా డిఇఒపై ఇతర అభియోగాలు కూడా ఉంటే చెప్పాలని విచారణ అధికారి అనడంతో, 2023లో జరిగిన బదిలీల్లో తిరుమల చైతన్య అక్రమాలకు పాల్పడ్డారని, ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు రాని ఏడుగురికి మాన్యువల్‌గా ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. ఇందుకోసం 10 శాతం ఖాళీలను బ్లాక్ చేశారని, 2024లో కెజిబివి పాఠశాలలో బోధన, బోధనేతర పోస్టుల భర్తీలో రోస్టర్ విధానం పాటించలేదన్నారు. 2025 బదిలీల్లో స్పౌజ్ నిబంధనలను తనకు అనుకూలంగా మార్చుకున్నారని, మూడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6 నుంచి 8 తరగతులు కలిసి 40 మంది విద్యార్థులు లేకపోయినా ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారని తెలిపారు. వమరవల్లి డైట్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా పాత భవనాలను కూల్చేసి, అందులో ఉన్న కలప, ఇనుమును విక్రయించి ఆ డబ్బును సొంతానికి వాడుకున్నారని తెలిపారు. అసలు దోషి డిఇఒ అని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. డిఇఒ తిరుమల చైతన్య, లావేరు ఎంఇఒ-1 వాగ్దేవి, రాజ్‌కిశోర్‌నూ విచారణ అధికారి లిఖితపూర్వకంగా సమాధానాలి వ్వాలంటూ ప్రశ్నావళి అందించారు. విచారణ అనంతరం నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు విచారణాధికారి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

త్వరలో ఆటో డ్రైవర్లకు రూ.పది వేలు

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - పలాస

త్వరలో ఆటో డ్రైవర్లకు రూ.పది వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. మందస మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న అనంతరం పలాసలోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తర్వాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'అన్నదాత సుఖీభవ' పథకం కింద వచ్చే నెలలో రైతులకు తొలి విడత కింద రూ.ఏడు వేలు జమ చేస్తామని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఆర్‌టిసి ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఇప్పటికే రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన చాలా సంస్థలు తిరిగి పరిశ్రమలు స్థాపించడానికి ముందుకొస్తున్నాయని తెలిపారు. పి-4తో పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు వైసిపి నాయకులు కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. వైసిపి హయాంలో ఒక్కో అవినీతి బయటపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పే దమ్ము, ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. మూలపేట పోర్టు పనులు త్వరలోనే పూర్తి కానున్నాయన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతో ఈ ప్రాంతానికి కార్గో ఎయిర్ పోర్టు రానుందని తెలిపారు. దీనివల్ల యువతకు ఉద్యోగావకాశాలతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గత ప్రభుత్వంలో కొల్లగొట్టిన నల్లబొడ్లూరు, బోడికొండ అవినీతిపై విచారణ సాగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంశధార ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వంశధార ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. మండలంలోని నిమ్మాడలో గల క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వంశధార ఎడమ కాలువ పరిధిలోని ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సరఫరాను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని సూచించారు. శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా పలాస, మేఘవరం, టెక్కలి, నందిగాం మండలాల పరిధిలో శివారు ఆయకట్టుకు నీరందేలా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం గొట్టాబ్యారేజీ నుంచి ఎడమ కాలువ ద్వారా అందిస్తున్న 1600 క్యూసెక్కుల నీటికి అదనంగా మరో 200 క్యూసెక్కులు పెంచాలని సూచించారు. ఎడమ కాలువ ఆయకట్టులో పరివాహక ప్రాంతాల్లోని మండలాలను మినహాయించి, ముందుగా దిగువ ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు గండ్లు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు సజావుగా వెళ్లేందుకు పర్యవేక్షణకు తాత్కాలిక సిబ్బందిని నియమించుకోవాలన్నారు. సమావేశంలో వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర, ఇరిగేషన్ అధికారులు స్వర్ణకుమార్, బి.శేఖర్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 'ప్రభుత్వ డ్రోన్' సాయం

వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు అందిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. క్యాంపు కార్యాలయంలో వ్యవసాయానికి ఉపయోగించే డ్రోన్‌ను ప్రారంభించి, నందిగాం మండలం నరేంద్రపురం రైతులకు పంపిణీ చేశారు. సాగుకు సాంకేతికతను జోడిస్తే కూలీల ఖర్చులు, సమయం ఆదా అవుతుందన్నారు. డ్రోన్ వాడకంతో సాగు ఖర్చు తగ్గి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాథస్వామి, జగన్మోహనరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు

శ్రీకాకుళం : నగరంలోని బిసి, ఎస్‌సి సంక్షేమ వసతిగృహాలు, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హాస్టల్స్‌లోని మౌలిక సదుపాయాలు, భద్రత, పరిశుభ్రత తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ పిల్లల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్, సంఘ సేవకులు కె.ఇందిరాప్రసాద్, వసతిగృహాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వంటలను పరిశీలిస్తున్న హరిబాబు

బాలల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో ప్రతి విద్యార్థికీ వైద్య పరీక్షలు నిర్వహించి, ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వెంటనే గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత అన్నారు. పైసా ఖర్చు లేకుండా పూర్తి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇప్పిలి వెంకట్ పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా 3,06,516 మంది విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. చిన్నారుల్లో జబ్బుల లక్షణాలను తొందరగా గుర్తించి తగిన చికిత్స అందించడం, తీవ్రమైన సమస్యలున్న వారిని మెరుగైన సదుపాయాలున్న ప్రభుత్వాస్పత్రులకు తరలించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల బరువు, ఎత్తు, దృష్టి, వినికిడి, మానసిక ఆరోగ్యం, దంతం, చర్మ సంబంధ సమస్యలు, రక్తహీనత వంటి అంశాలపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు వైద్య సిబ్బందికి శిక్షణ పూర్తయిందని, ప్రస్తుతం విద్యార్థుల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.



చిన్నారులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ప్రతి కుటుంబానికీ ఇల్లు

ఎస్ఎస్ఎల్ఆర్ అదనపు డైరెక్టర్ గోవిందరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రానున్న మూడేళ్లలో జిల్లాలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఇళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రస్థాయి సర్వే, భూమి నమోదు విభాగం (ఎస్ఎస్ఎల్ఆర్) అదనపు సంచాలకులు ఆర్.గోవిందరావు సూచించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, రీ సర్వే, పిజిఆర్ఎస్, హౌసింగ్ తదితర శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థలాలు అందుబాటులో లేని పట్టణ ప్రాంతాల్లో టిడ్కో గృహాల ద్వారా నివాస సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పిజిఆర్ఎస్ వేదికగా వచ్చిన ప్రతి అర్జీపైనా తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అర్జీలు పరిష్కారంలో జాప్యం తగదని స్పష్టం చేశారు. 2019 కన్నా ముందే అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ పూర్తి చేయాలని చెప్పారు. ఈ ప్రక్రియను ఈ ఏడాది డిసెంబరు నాటికి ముగించాలని ఆదేశించారు. సర్వే సంబంధిత అంశాలపై భౌతికంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. షెడ్యూల్డ్ తరగతుల హాబిటేషన్ల వద్ద శ్మశాన వాటికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట రహదారులు లేకపోతే నరేగా పథకం ద్వారా మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆక్రమణలు ఉంటే తొలగించాలని స్పష్టం చేశారు. రీ సర్వే 2.0 డిసెంబరు 27 నాటికి పూర్తి కావాలన్నారు. ఆగస్టు 5 నాటికల్లా గ్రామ సరిహద్దుల ఖరారును పూర్తి చేయాలని సూచించారు. జాయింట్ ఎల్‌పిఎం, సబ్ డివిజన్ వంటి కీలక విభాగాల్లో పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి అర్హులైన వ్యక్తికీ కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.. దీనిపై తహశీల్దార్లు దృష్టిసారించాలన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒలు సాయిప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, వెంకటేష్, సర్వే, గృహ నిర్మాణ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

రిమ్స్ సెక్యూరిటీగార్డులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రిమ్స్ సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించాలని కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో అర్జీదారులను స్వీకరించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 15 ఏళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా సేవలందిస్తున్నామని అన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పాత కాంట్రాక్టర్ ఏప్రిల్, మే నెలల ఏరియర్స్ చెల్లించలేదన్నారు. జూన్ నుంచి కొత్త కాంట్రాక్టర్ బాధ్యతలు తీసుకుని రెండు నెలలుగా గడుస్తున్నా ఇప్పటివరకు వేతనం చెల్లించలేదని వివరించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానంటుతుంటే... అతి తక్కువ వేతనంతో కుటుంబాన్ని నెట్టుకురావడం భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు గ్రీవెన్స్ ఇచ్చిన వారిలో సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కో-కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, రిమ్స్ నాయకులు ఎం.సూర్యనారాయణ, టి.రామారావు, బి.శ్రీను, ఎస్.రాజేంద్ర, ఎం.శ్రీను, హెచ్.లక్ష్మణ, టి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగు హక్కు కల్పించాలి

సీతంపేట మండలం మర్రిగూడలో 2021లో 15 ఎకరాలు అప్పటి ప్రభుత్వం గిరిజనలకు అందజేసిందని, పట్టాలు ఇచ్చినా 1బిలు రావటం లేదని 12 మంది లబ్ధిదారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారించి న్యాయం చేయాలని కోరారు. లావేరు మండలం లక్ష్మీపురంలో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన రేషన్ డిపో అప్పజెప్పటం లేదని వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం గార వీధికి చెందిన మీనాక్షి తన కుమారులు తన నుంచి ఆస్తులు లాక్కుంటున్నారని, కుమార్తెకు అన్యాయం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. తల్లికి వందనం పథకం వర్తించలేదని మహిళలు నుంచి ఫిర్యాదులు వచ్చాయి.

అర్జీల పరిష్కారం వేగవంతం

అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్వీకరించిన అర్జీల్లో రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, సాంఘిక సంక్షేమశాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా విద్యాశాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, డ్వామా, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖల సమస్యలపై 98 అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అర్జీలు స్వీకరణలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.

'మీకోసం'లో 98 అర్జీలు స్వీకరణ



వినతిపత్రం అందజేస్తున్న రిమ్స్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెగా జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి - పాతపట్నం

నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన పాతపట్నం మండల కేంద్రంలోని ఒక డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాలో మొత్తం 12 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగావకాశాల కోసం హాజరైన 365 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, వారిలో 162 మంది యువతీ యువకులు పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతను కంపెనీల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి ప్రభుత్వమే కంపెనీలను వారి దగ్గరకు తీసుకొస్తోందన్నారు.

యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ మాట్లాడుతూ, ఉద్యోగం దూరమైనా సరే అవకాశం వచ్చినప్పుడు చేరాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల ఆచార్యులు, కరస్పాండెంట్ ఎస్.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు వేగవంతం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బి అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం చేపడుతున్న పనులు, పార్కింగ్, డ్రైనేజీ పనులను పరిశీలించిన పలు సూచనలు జారీ చేశారు. పనులు వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ పరిధిలో నిర్మిస్తున్న రహదారి ఆకృతి, డ్రైనేజ్ మార్గాలు, వాటి అనుసంధానాన్ని కాంట్రాక్టర్ కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న కలెక్టర్, పార్కింగ్, భద్రతా గదులు, రక్షణ గోడ వంటి ఇతర పనుల వివరాలను తెలుసుకున్నారు. నాణ్యతపై ఎక్కడా రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఎస్ఇ సత్యనారాయణ, ఇఇ తిరుపతిరావు, కాంట్రాక్టర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎలక్ట్రోరల్ రోల్స్ నమోదులో

సమస్యలుంటే చెప్పండి

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎలక్ట్రోరల్ రోల్స్ నమోదులో సమస్యలు ఉంటే తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. డిఆర్‌ఒ ఛాంబరులో ఎలక్ట్రోరల్ రోల్స్ తదితర వాటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రోరల్ రోల్స్‌లో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. 2358 పోలింగ్ బూత్ స్థాయి అధికారులు యాక్టివ్‌గా ఉండే విధంగా చూడాలని తెలుగుదేశం పార్టీ ప్రతినిధి పి.ఎం.జె బాబు సూచించారు. సమావేశంలో శంకరరావు (వైసిపి), గౌరీశంకరరావు (సిపిఎం), సురేష్‌బాబు సింగ్ (బిజెపి), భూపతి అర్జున్ కుమార్ (జనసేన), సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

రేపు ఉద్యోగమేళా

శ్రీకాకుళం సిటీ : నగరంలోని నెహ్రూ యువ కేంద్రంలో ఈనెల 30న ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.సుధ ప్రకటనలో తెలిపారు. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో అపోలో ఫార్మసీ, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు సంస్థలు పాల్గొనున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అపోలో ఫార్మసీ విశాఖపట్నం, శ్రీకాకుళంలో ఫార్మాసిస్ట్ 20 పోస్టులకు బి.ఫార్మసీ, డి.ఫార్మసీ అర్హతతో 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులు కాగా, వేతనం నెలకు రూ.16,400 అని తెలిపారు. సేల్స్ అసోసియేట్ 30 పోస్టులకు పదో తరగతి అర్హతతో 18 నుంచి 35 ఏళ్ల వయసు గల వారు అర్హులు కాగా, వేతనం నెలకు రూ.15,200 అని పేర్కొన్నారు. డెలివరీ అసోసియేట్ 50 పోస్టులు కాగా, పదో తరగతి అర్హతతో 18 నుంచి 35 ఏళ్ల వయసు గల వారు అర్హులు కాగా, వేతనం నెలకు రూ.11,500 అని తెలిపారు. నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు విశాఖపట్నంలో క్లర్కు 10 పోస్టులు, డిగ్రీ అర్హతతో 26 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులు కాగా, వేతనం నెలకు రూ.20,200 అని పేర్కొన్నారు. డ్రైవర్ 10 పోస్టులకు పదో తరగతి అర్హతతో 19 నుంచి 26 మధ్య ఏళ్ల వయసు గల వారు అర్హులు కాగా, వేతనం నెలకు రూ.12,100 అని తెలిపారు. హెల్పర్ పది పోస్టులకు పదో తరగతి అర్హతతో 19 నుంచి 26 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులు కాగా, వేతనం నెలకు రూ.12,100 అని తెలిపారు. అభ్యర్థులు www.ncs.gov.in వెబ్‌సైట్‌లో ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, నమోదు చేసుకున్న అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

విద్యార్థులను రోడ్డుపై నిలబెట్టిన విద్యాసంస్థ

- పాఠశాల గేట్లు మూసివేసిన తల్లిదండ్రులు
- ఉప విద్యాశాఖాధికారి విచారణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన తమ పిల్లలకు అందిస్తారని తల్లిదండ్రులు వేలల్లో ఫీజులు చెల్లించి చేర్పించిన తల్లిదండ్రులకు ఓ ప్రైవేటు పాఠశాల సమయం మించిందంటూ గేట్లకు గడియలు పెట్టి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నడిరోడ్డుపై నిలబెట్టిన సంఘటన చోటు చేసుకుంది. పట్టణ శివారులో ఉన్న సెయింట్ ఆన్స్ పాఠశాల యాజమాన్యం వ్యవహరించిన తీరు విద్యార్థుల తల్లిదండ్రులను ఆగ్రహానికి గురిచేసింది. సోమవారం ఉదయం కనుగులవలస, జి.కె.వలస, కొండవలస తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆటోల్లో పాఠశాల ప్రధాన గేటు వద్దకు 8.45 గంటలకు చేరుకునే సరికి పాఠశాల యాజమాన్యం ప్రధాన గేట్లను మూసివేయడంతో విద్యార్థులు రహదారిపై గంటల తరబడి వేచి ఉండిపోయారు. ఆటో డ్రైవర్లు విద్యార్థుల తల్లిదండ్రులకు జరిగిన విషయం చేరవేయడంతో అక్కడకు చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రధాన గేటుకు బయటి నుంచి గడియ పెట్టి నిరసన తెలిపారు. దీంతో పాఠశాల యాజమాన్యం 100కు కాల్ చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువు వర్గాలకు నచ్చ చెప్పినప్పటికీ ఎవరూ వినలేదు. విద్యార్థుల తల్లిదండ్రులు


ప్రధాన గేటు బయట వేచి ఉన్న విద్యార్థులు

జిల్లా ఉప విద్యాశాఖాధికారి, ఎంఇఒలకు ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎంఇఒ జి. రాజేంద్రప్రసాద్ పాఠశాల వద్దకు చేరుకొని యాజమాన్యం, విద్యార్థులు వారి తల్లిదండ్రులను విచారించారు. ఉదయం 8:30 నిమిషాలకు తమ పిల్లలను పాఠశాలకు తీసుకురావడం జరుగుతుందని, టైం అయిపోయిందని యాజమాన్యం ప్రధాన గేటును తరచూ మూసివేయడంతో విద్యార్థులు ప్రధాన రహదారికి ఇరువైపులా ఎండలో నిలబడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 8.30 గంటలకు వచ్చే తమ పిల్లలను బయట ఉంచి 9 గంటల తర్వాత వచ్చిన పాఠశాల బస్సులను లోపలకి ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. ఏడాది బస్సు చార్జీలను వసూలు చేసి ఇప్పటికీ కనుగుల వలసకు పాఠశాల బస్సులను నడపడం లేదని తల్లిదండ్రులు విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విచారించిన డిప్యూటీ డిఇఒ అసహనం వ్యక్తం చేస్తూ పది నిమిషాలు అటు ఇటుగా విద్యార్థులను అనుమతించాలని, ఒకవేళ మరింత ఆలస్యంగా వస్తే పాఠశాల ఆవరణలో ఉంచాలి తప్ప ఆరు బయట ఎలా నిలబెడతారని ప్రశ్నించారు. సమస్యలు ఉంటే తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడాలన్నారు. అనంతరం డిప్యూటీ డిఇఒ విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆందోళన చెందడంలో అర్థం ఉందని, అయితే పాఠశాల సమయాలను కూడా పాటించాలన్నారు. సంఘటనపై నోటీసులు అందజేశామని, మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీస్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూములను పేదలకు పంపిణీ చేయాలి

ఆమదాలవలస: కొండ పోరంబోకు భూములను పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సైలాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 183లో సుమారు 225 ఎకరాల సంగమయ్య కొండ పోరంబోకు భూములను స్థానిక యువతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండ పోరంబోకు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఆ భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సర్వేనెంబర్ 296లో ఎకరా ప్రభుత్వ భూమిని శీర సంజీవరావు తల్లికి డి పట్టా ఇచ్చినట్లు తెలిపారు. 183 సర్వే నెంబర్‌లో 296 సర్వే నెంబర్‌తో పట్టా ఇచ్చినట్లు ఉందని రెవెన్యూ అధికారులు పెత్తందారులకు డి పట్టాను ఎలా మంజూరు చేశారో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే కొండ పోరంబోకు భూములు అన్యాక్రాంత మవుతున్నాయని, సంగమయ్య కొండ చుట్టూ సైలాడ, కుమ్మరిపేట, చిట్టివలసలో ఉన్న పేదలకు ఆ భూములను పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే పెత్తం దారులు, రాజకీయ నాయకులు ఆక్రమించే పరిస్థితి


డి-పట్టా భూమిని పరిశీలిస్తున్న సింహాచలం తదితరులు

ఏర్పడుతుందని, ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సంగమయ్య కొండ చుట్టూ ఉన్న కొండ పోరంబోకు భూములను కాపాడి పేదలకు పంపిణీ చేయాల న్నారు. లేని పక్షంలో పేదలను సమీకరించి భూములను ఆక్రమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు, గతంలో ఎక్స్ సర్వీస్ మెన్‌కి చిట్టెయ్యవలసలో ప్రభుత్వం భూమిని మంజూరు చేస్తే నేడు డి పట్టా పేరుతో భూమిని ఆక్రమించుకున్న పెత్తందారులే ఆ రోజుల్లో విశ్రాంత సైనికుడిని అడ్డుకోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నవిరి శ్రీనివాస్, పిన్నింటి యుగంధర్, మట్ట వసంత తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా సమస్యల పరిష్కారంలో బాధితులకు సత్వరమే న్యాయం అందించాలని పోలీస్ అధికారులను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (మీకోసం) నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 52 మంది ఫిర్యాదుదారులతో ఎస్‌పి ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదుల స్వీకరించి చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులను సంబందిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి అందజేయాలని అధికారులకు సూచించారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సహకరించాలి

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తన క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎపి ఐఐసి (పరిశ్రమల శాఖ) అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్, జోనల్ మేనేజర్ మురళి మోహన్‌తో మాట్లాడారు. వలసలు నివారించి పండిన పంటలకు అనువుగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు పెట్టేందుకు సిఎం చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.


రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న విఎఎ సుమాంకా

యూరియా పంపిణీ

లావేరు: మండల కేంద్రం లావేరు రైతు సేవాకేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ సోమవారం నిర్వహించారు. విఎఎ పి.సుమాంకా ఆధ్వర్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పంపిణీ చేశారు. రైతులకు ఉన్న భూమిని బట్టి యూరియా పంపిణీ చేశారు. యూరియా కోసం రైతులు ఎగబడినా గత రెండు రోజులు ముందుగానే కూపన్లు ఇవ్వడంతో సోమవారం యూరియా ఇచ్చే విధానం సక్రమంగా ఉండడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ సాఫీగా జరిగింది. 400 బస్తాలు పంపిణీ జరిగినట్లు విఎఎ సుమాంకా తెలిపారు.



మాట్లాడుతున్న గోవిందరావు

భూ సమస్యలు తలెత్తకూడదు

కోటబొమ్మాళి: రైతులకు భూ సర్వే ద్వారా ఎటువంటి సమస్యలు తలెత్తకూడదని ఎడినల్ డైరెక్టర్, సర్వే, సెటల్‌మెంట్ అధికారి రోణంకి గోవిందరావు అన్నారు. మండలంలోని ఇటీవల సర్వే అయిన నారాయణవలస గ్రామసభలో సోమవారం పాల్గొని మాట్లాడారు. పలువురు రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తదండ్రులు పేరుతో ఉన్న పాస్‌పుస్తకాలు కుమారులకు రాలేదని, భూముల్లో సర్వే నంబర్లు తక్కువ భూమిని చూపిస్తుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఇలాంటి సమస్యలు లేవి పునరావృత్తం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఆర్‌ఐ పవిత్ర పాల్గొన్నారు.

ఫిజిక్స్ విభాగాధిపతిగా శ్రీధర్

ఎచ్చెర్ల : శివానీ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో గల రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ) ఎచ్చెర్లలో ఫిజిక్స్ విభాగానికి నూతన విభాగాధిపతిగా డా. బెందాలం శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్ డా. బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ డా.శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, క్యాంపస్-2 ఇన్‌ఛార్జి సాగర్, అధ్యాపకులు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఫిజిక్స్ విద్యలో నూతన అధ్యాయాన్ని ఆవిష్కరించేందుకు డా. శ్రీధర్ అనుభవం దోహదపడుతుందని, విద్యారంగ అభివృద్ధికి ఆయన సేవలు చాలా ఉపయోగపడతాయని వారంతా ఆకాంక్షించారు.


జాయినింగ్ పత్రం అందజేస్తున్న శ్రీధర్

సస్పెన్షన్ సమాచారం గోప్యం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాటీలో కీలక విభాగంలో పనిచేస్తున్న అధికారిని ఇటీవల ప్రభుత్వం సస్పెండ్ చేసినట్టు సమాచారం ఉందని వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణభారతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సమాచారం కౌన్సిల్ సభ్యులకు, ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కమిషనర్‌కు ఉందన్నారు. కీలక విభాగంలో ఆ అధికారి సస్పెండ్ అయ్యారన్న విషయం తెలియక భవన అనుమతులు కోసం అతనితో సంప్రదింపులు చేసి ప్రజలు, కౌన్సిల్ సభ్యులు మోసపోయే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

శివకు బంగారు పతకం

సోంపేట మండల కేంద్రం సోంపేట పట్టణానికి చెందిన కాశి శివకుమార్ రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీల్లో ప్రతిభ ప్రదర్శించి పతకాలు సాధించాడు. ఆదివారం గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో బెంచ్ ప్రెస్‌లో బంగారు పతకం, పవర్ లిఫ్టింగ్‌లో రజత పతకాలు సాధించాడు. విజయం సాధించిన శివను స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.



నిధులు మంజూరు చేయాలి

టెక్కలి : టెక్కలిలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి ప్రభుత్వపరంగా నిధులు మంజూరు చేయాలని దళిత సంఘాల జెఎసి నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలిలో పది సెంట్లు స్థలం అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం ఉందన్నారు. కానీ, నిర్మాణానికి నిధులు ఆటంకంగా ఉన్నాయని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ నాయకులు బోకర నారాయణరావు, యడ్ల గోపి, బూరగాన బాబూరావు, బోకర మోహనరావు పాల్గొన్నారు.

టెండర్లపై విచారణ చేపట్టాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ఎటువంటి పత్రాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా రూపొందించిన పత్రాలతో పొందిన టెండర్లపై సమగ్ర విచారణ చేపట్టాలని సివిల్ కాంట్రాక్టర్ పెడడా అప్పలస్వామి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల మున్సిపాలిటీలో నిర్వహించిన టెండర్లలో అక్రమాలు, నియమ నిబంధనలు ఉల్లంఘనపై దర్యాప్తు చేపట్టాలని కోరారు. ఈ నెల 4న నిర్వహించిన టెండర్లలో ఏజెన్సీలు, ఫర్మ్ పేర్లతో అక్రమ పత్రాలు పొంది రిజిస్ట్రేషన్ పత్రాలు సంపాదించారని అన్నారు. టెండర్ల విధానంలో షరతులను ఉల్లంఘించి ఎటువంటి అర్హత లేకపోయినా కొందరిని ఒప్పించి పొందారని ఆరోపించారు. ఇదే విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని వివరించారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి

మహిళల రక్షణ కోసం వినియోగించే శక్తి యాప్ వినియోగంపై అవగాహన ఉండాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. కళాశాల ఆవరణలో సోమవారం శక్తి యాప్ వినియోగంపై కళాశాల మహిళా విభాగం ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఎస్.రాము అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

కూపన్ పద్ధతిలో ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

ఎరువుల పంపిణీ వద్ద రైతులకు తోపులాట లేకుండా, ప్రతిఒక్కరికీ అందించాలనే ఉద్దేశంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కూపన్ పద్ధతిలో రైతులకు ఎరువులు అందించనున్నట్లు ఎఒ పిరియా శ్రీదేవి తెలిపారు. ప్రస్తుతం యూరియా 65ఎంటి, కాంప్లెక్స్ 40ఎంటి, డిఎపి 20ఎంటి అందుబాటులో ఉన్నాయని అన్నారు. అవసరమైన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలోని విఎఎ, విహెచ్‌ఎలను సంప్రదించాలని సూచించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని 103 మంది కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులను మంజూరు చేయడం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషారాణి తెలిపారు. కౌలు రైతులకు ఇప్పటికే ఈ క్రాప్ట్ నమోదు, రెండవ విడత అన్నదాత సుఖీభవ పథకం నిధులను ప్రభుత్వం విడుదల చేసినప్పుడు గుర్తింపు కార్డు కలిగి ఉన్న కౌలు రైతులందరికీ రెండు దపాలుగా రూ.20 వేలు చొప్పున రైతుల అకౌంట్‌కు ప్రభుత్వం జమ చేయడం జరుగు తుందని తెలిపారు.


ఉషారాణి, ఎఒ

సింధూరకు అభినందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ పైడి సింధూరను సోమవారం పలువురు అభినందించారు. విశ్రాంత డిజిపి కె.పూర్ణచంద్రరావు, డాక్టర్ పి.బి కామేశ్వరరావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. వైద్యులుగా పేద ప్రజలకు సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యత శతశాతం సమర్థ వంతంగా నిర్వహిస్తామన్నారు. ప్రణాళికా బద్ధంగా భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.


సింధూర

పోస్టల్ బాధితులు నిలదీత

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పోస్టల్ అక్రమాలపై బాధితులకు అండగా నిలుస్తామని జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. సోమవారం పోస్టాఫీసు కార్యాలయం లోపలికి వెళ్లి అధికారులను బాధితులతో కలిసి నిలదీశారు. అనంతరం రాజు బాధితుల అభ్యర్థన మేరకు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ హరిబాబుతో సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. ఇప్పటి వరకు రూ2.86 కోట్లు గుర్తింపు, ఇంకా వస్తున్న బాధితులు పోస్టల్ కార్యాలయంలో రూ.కోట్లలో జరిగిన భారీ స్కాంపై పోస్టల్ ఖాతాదారులు నిలదీశారు. ఇక్కడ కోట్లలో కుంభకోణం జరిగితే కనీసం కార్యాలయానికి రాకుండా కింద స్థాయి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో విచారణ చేపట్టడం సరికాదన్నారు. సోంపేట పోస్టల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ కాతాదారులతో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని స్పష్టం చేశారు. ప్రతి పైసా మీకు అందుతుందని హామీ ఇచ్చారు. మంగళవారం గ్రీవెన్స్‌నిర్వహించి బాధితుల నుంచి బాండ్లను స్వీకరిస్తామని తెలిపారు. డూప్లికేట్ పుస్తకాలు ఉన్నా వాటిని తీసుకొస్తే అవీ పరిశీలిస్తామని తెలిపారు.


పోస్టల్ అధికారులను నిలదీస్తున్న బాధితులు

బూటకపు హామీలతో చంద్రబాబు వంచన


వజ్రపుకొత్తూరు : బాబు మోసాలను వివరిస్తున్న ఉదయ్‌కుమార్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బూటకపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజలను వంచన చేశారని వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండవూరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికార కాంక్షతో సాధ్యం కాని హామీలు ఇంటింటికీ వెళ్లి బాండ్లు ఇచ్చి నమ్మించి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. టిడిపి నాయకులను ప్రజలు నిలదీయాలని కోరారు. జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొల్లి భాస్కరరావు, వైసిపి మండల ఉపాధ్యక్షుడు దున్న బాలరాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు ఇప్పిలి అప్పన్న, ఎంపిటిసి వెంకన్న, లక్ష్మణ్, మహిళా నాయకులు జల్లు ఉషారాణి, లండ వాసు, మద్దిల తిరుపతి, నగేష్, సింహాచలం పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని కొల్లిపాడు, మరువాడ, మేఘవరం పంచాయతీల్లో వైసిపి మండల అధ్యక్షులు బి.మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎన్ని మన్మథరావు, మేరుగు అప్పారావు, నక్క భీమారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: సిఎం చంద్రబాబు నాయుడు మోసాలు, అబద్ధపు హామీలతోనే అధికారం చేపట్టారని వైసిపి రూరల్ మండల అధ్యక్షుడు చిట్టి జనార్ధన అన్నారు. మండలంలోని కిష్టప్పపేట, సానివాడలో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చంద్రబాబు నాయుడు ప్రజలకు చేసిన మోసాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు చేస్తున్న వంచనను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారులు లేరా..?

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులు, వితంతు, వికలాంగ పింఛనుదారులు ఎవరూ లేరా అని రాగోలు పంచాయతీ కార్యదర్శిని ఢిల్లీ నుంచి వచ్చిన మానిటరింగ్ సభ్యులు జామి థార్ సాబ్, ఎస్‌ఎస్ రాథోడ్ ప్రశ్నించారు. మండలంలోని రాగోలు, సిలగాం సింగువలస గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. కేంద్ర బృందం సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్లు సక్రమంగా అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకోవడానికి పింఛనుదారులు ఎవరూ లేకపోవడంతో కేంద్ర బృందం సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ముందుగా ఉపాధి పనుల్లో నిర్మించిన కాలువలు, సిసి రోడ్లను ఢిల్లీ బృందం పరిశీలించింది. అనంతరం ఎన్‌ఆర్‌ఇజిఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇంజినీరింగ్, అంగన్వాడీ తదితర శాఖల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గేదెల చంగలరావు, కంచు దశరథుడు, వై.గురుమూర్తి, గేదెల శ్యామలరావు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

'స్వీయ ఆధారిత భారత్'పై వ్యాసరచన పోటీ


అవగాహన కల్పిస్తున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

టాటా బిల్డింగ్ ఇండియా స్కూల్ ఎస్సె కాంపిటీషన్ ఆధ్వర్యాన నడసంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం స్వీయ ఆధారిత భారతదేశాన్ని నిర్మిద్దాం' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సందర్శించిన టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీ ప్రతినిధి నాగేశ్వరావు మాట్లాడుతూ 2004వ సంవత్సరం టాటా గ్రూపు వారి సెంచరీ ఆఫ్ ట్రస్టు పేరిట వందేళ్లు పూర్తయిందన్నారు. దీంతో టాటా కంపెనీ భారత దేశపు భూభాగంపై చెరగని ముద్ర వేసిందని అన్నారు. అప్పట్నుంచి విద్యార్థులకు సృజనాత్మకతను పెంచేందుకు దేశంలోని విద్యార్థులతో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. హెచ్‌ఎం భాస్కరమిశ్రా మాట్లాడుతూ విద్యార్థులు తాము ఇష్టపడే భారతదేశం గురించి కలలుగానే కల్పన శక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఉపాధ్యాయులు ధర్మారావు నిర్వహించారు. పోటీల్లో విజేతలు సుమన్, అలోక్, మధు, చాందిని, ప్రేమాంజలిలకు బహుమతులను అందజేశారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

సోంపేట : కర్ణాటక ధర్మస్థలిలో జరిగిన నేరాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో ఉన్నత స్థాయి దర్యాప్తు చేపట్టి దోషులను శిక్షించాలని ఎపి మహిళా సమాఖ్య ఎన్‌ఎఫ్‌యుఎన్ జిల్లా కార్యదర్శి పుక్కల్ల అరేలమ్మ డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్పలాం పంచాయతీ ఎకువూరులో మహిళలతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. తక్షణమే సాక్ష్య రక్షణ, ఫిర్యాదుదారులకు, న్యాయవాదులకు రక్షణ కల్పించాలన్నారు. ఆకాలంలో తప్పిపోయిన అమ్మాయిల కుటుంబ సభ్యుల ఫిర్యాదులపై సమగ్రంగా విచారించాలన్నారు. కార్యక్రమంలో బి.మాడికమ్మ, నీలవేణి, డి.బానమ్మ, లక్ష్మి, జి.గంగవేని, పి.పూజ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక


అభినందిస్తున్న హెచ్‌ఎం హేమారావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు సోమవారం తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన సౌత్‌జోన్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని అన్నారు. పదో తరగతి విద్యార్థి బి.కుమారస్వామి లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, 4.43 మీటర్ల జంప్‌తో కొత్త జిల్లా రికార్డు నెలకొల్పాడన్నారు. అలాగే 60 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించాడని తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థి బి.ఉదయ్ జావిలిన్ త్రోలో ద్వితీయ స్థానం సాధించాడని అన్నారు. వీరిరువురూ వచ్చే 9 నుంచి బాపట్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు పి.గజేంద్రరావు, జె.నారాయణరావులను అభినందించారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

దూసి - పొందూరు రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుడు వయసు సుమారు 65 ఏళ్లు ఉంటుందని, షర్టు, లుంగీ ధరించి ఉన్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9493474582 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ తెలియజేశారు.

వ్యక్తి అదృశ్యం

రణస్థలం: జె.ఆర్. పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పైడిభీమవరం గ్రామానికి చెందిన కంతస్ఫూర్తి కనకరాజు ఈనెల 21న ఉదయం 10.30 గంటలకు ఎప్పటిలాగే అల్పాహారం తినేందుకు పైడి భీమవరం వంతెన కిందకు వెళ్లారని, అప్పటినుంచి కనిపించడం లేదని ఆయన కుమారుడు సత్తిరాజు సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఎక్కడా ఆచూకీ దొరకలేదన్నారు. సత్తిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మానసికంగా, ఆరోగ్యంగా ఉన్నాడని ఫిర్యాదుదారుడు ధ్రువీకరించాడని పేర్కొన్నారు. తప్పిపోయిన తన తండ్రిని గుర్తించ డానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సత్తిరాజు అభ్యర్థించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అచూకి తెలిసిన వారు 9010985148, 9493596747, 9182919576, 9441937170 నంబర్లుకు తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు.


కనకరాజు (ఫైల్)

చీటింగ్ కేసులో ఎంపిపి అరెస్టు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మండల పరిధిలోని ఫరీదుపేట గ్రామానికి చెందిన ఎంపిపి మొదలవలస చిరంజీవిని సోమవారం ఉదయం ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. ఎచ్చెర్ల ఎస్‌ఐ వి. సందీప్ కుమార్ తెలిపిన వివరాల మేరకు ఒడిశాలో 1999లో ఓ చీటింగ్ కేసులో అక్కడి కోర్టు నాన్ బెయిల్‌బుల్ వారెంట్ ఇష్యూ చేయటంతో ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశా కోర్టు ఆదేశాల మేరకు ఒడిశా పోలీసు ఉన్నతాధికారులు ఆంధ్రా పోలీసులకు సమాచారం తెలపడంతో జిల్లా పోలీసులు అరెస్టుకు అవసరమైన సహాయం అందించినట్టు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

సోంపేట: సోంపేట ఎక్సైజ్ సిఐ, మొబైల్ సిబ్బంది ఆంధ్రా-ఒడిశా అంతరాష్ట్ర కార్ల కదలికలపై నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో కారులో అక్రమంగా తరలిస్తున్న 900 నాటుసారా ప్యాకెట్లను సోమవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సిఐ రమణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కారులో నాటుసారా రవాణా అవుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లామన్నారు. కంచిలి మండలం కేసరపడ దగ్గర తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు దగ్గర కాను పరిశీలించామన్నారు. అందులో ఆరు ప్లాస్టిక్ గోనె సంచుల్లో ఒక్కొక్క దానిలో 150 నాటుసారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నాటుసారాను రవాణా చేస్తున్న వ్యక్తిను ఒడిశా రాష్ట్రం మున్నీసుపేటకు చెందిన మొగిలి కుమార్‌గా గుర్తించామన్నారు. అలాగే పెద్ద శ్రీరామపురానికి లొట్ల జోగారావు తెప్పిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారని తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బంది మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతిలను అభినందించారు.

పశువులపై కుక్కల దాడులు

పొందూరు: పశువులపై కుక్కలు దాడులు చేస్తుండడంతో పలు ఆవులు తీవ్రంగా గాయపడుతుండగా, మరికొన్ని మృత్యువాత పడుతున్నాయి. మండలంలోని రాపాకలో పశువుల షెడ్లులో ఉన్న పాడి ఆవులు, దూడలపై కుక్కల గుంపులు దాడికి పాల్పడుతూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. రాత్రి వేళల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ షెడ్లులో ఉన్న పశువులపై దాడి చేస్తుండడంతో పాడి రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో కుక్కలు దాడి చేయడం గమనించి వాటిని తరిమికొట్టేందుకు వెళ్తుంటే మనుషులపై కూడా దాడికి పాల్పడు తున్నాయంటూ రైతులు వాపోతున్నారు. ఇప్పటికే కుక్కల దాడిలో ఎన్నో ఆవులు, దూడలు మృతిచెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన కొంచాడ సూర్యనారాయణకు చెందిన లేగదూడపై కుక్కలు దాడి చేయగా సమీపంలో ఉన్న వ్యక్తి వాటిని తరిమి కొట్టడంతో గాయాలతో బయటపడిందని, ఎవరూ చూడకపోతే కుక్కలు మూకుమ్మడిగా చంపేస్తాయని ఆయన వాపోయారు. మండలంలో ప్రతి గ్రామంలో ఇదే విధంగా పశువులపై కుక్కలు దాడికి పాల్పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటు న్నాయి. దీనిపై అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గాయపడిన దూడను చూపిస్తున్న రైతు



చరణ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

చరణ్‌కు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

క్రీడల్లో అత్యున్నత ప్రతిభ ప్రదర్శించిన రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన అట్టాడ చరణ్‌ను సన్మానించి అభినందించారు. థాయిలాండ్ వేదికగా ప్రతిష్టాత్మక 2వ ఎషియన్ అండర్ -16 (మెన్) వాలీబాల్ చాంపియనిన్ షిప్ - 2025 పోటీలు నిర్వహించారు. భారత జట్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున చరణ్ ప్రాతినిధ్యం వహించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న గ్రామస్తులు

కళాకారునికి సత్కారం

కవిటి: మండలంలోని కపాసుకుద్దిలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ జానపద సంగీత గురువు కొత్తపల్లి ఆదినారాయణకు ఘన సన్మానం నిర్వహించారు. ఇచ్ఛాపురం మండలం టి.బరపురానికి చెందిన తిప్పన ధనుంజయ రెడ్డి దంపతుల ఆధ్వర్యాన సోమవారం ఆలయ ప్రాంగణంలో 12 గంటల అర్థ ఏకాహం భజన కార్యక్రమాన్ని సంగీత కళాకారుల సమ్మేళనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవంకకు చెందిన సంగీత గురువు కొత్తపల్లి ఆదినారాయణను గ్రామ పెద్దల సమక్షంలో సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తోట ధర్మరాజు, పులకల శ్రీరాములు, కూర్మారావు దాస్ రౌలో, చలపురాయి ఏకాంబరం, చలపరాయి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న డిప్యూటీ డిఇఒ విజయకుమారి

విద్యార్థుల వివరాలు అప్‌లోడ్ చేయాలి

పొందూరు: అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి అన్నారు. మండలంలోని కింతలి జెడ్‌పి ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. సాంకేతిక కారణాలతో తల్లికి వందనం పథకానికి దూరమైన విద్యార్థులను గుర్తించి అటువంటి విద్యార్థుల వివరాలను యాప్‌లో అప్లోడ్ చేయాలని హెచ్ఎం గోవిందరావును ఆదేశించారు. విద్యాకిట్లను ప్రతి విద్యార్థికి అందేలా చూడాల్సిన బాధ్యత హెచ్ఎంలదే అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులను దుశ్శాలువతో సన్మానించారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర ప్రసాద్

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు చేపట్టాలి

నరసన్నపేట: ఎపి సార్వత్రిక విద్యాపీఠం ద్వారా దూరవిద్య ప్రవేశాలు చేపట్టాలని ఎంపిడిఒ వెంకటేశ్వర ప్రసాద్ సూచించారు. ఎంఆర్‌సి కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ క్లస్టర్ మొబైల్ టీచ్స్‌తో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు మండల్ లెవల్ ఒన్ డే ఆర్గనైజేషన్ ప్రోగ్రాం గురించి అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రవేశాలు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒలు యు.శాంతారావు, దాలినాయుడు పాల్గొన్నారు.



ఎన్నికైన పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీసభ్యులు

పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ఆమదాలవలస: మండల, మున్సిపాలిటీ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని గాజుల కొల్లివలస చర్చిలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను రాడ విజయ్ కుమార్, డాక్టర్ జార్జిముల్లర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీసభ్యులు బాధ్యతతో పదవులను నిర్వహించి సంఘానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రెసిడెంట్‌గా స్టీఫెన్, ప్రధాన కార్యదర్శిగా శ్యామ్, కోశాధికారిగా విజయ్, వైస్ ప్రెసిడెంట్‌గా షద్రక్ బాబు, సహాయ కార్యదర్శిగా దుర్గాప్రసాద్, ఉప కోశాధికారిగా దేవిడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల నుంచి వచ్చిన పలు ఫిర్యాదుల మేరకు సోమవారం పురపాలక సంఘంలో పలు ఆక్రమణలను, అక్రమ కట్టడాలను తొలగింపు ప్రక్రియను కమిషనర్ నడిపేన రామారావు చేపట్టారు. 3వ వార్డు శివాజీ నగర్ కాలనీలో నిర్మాణమవుతున్న సిమెంట్ రోడ్డుపై పలు ఫిర్యాదులు రావడంతో సదరు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అలాగే పాత జాతీయ రహదారికి ఆనుకొని అనుమతులు లేని భవన నిర్మాణాన్ని తనిఖీ చేశారు. మొగిలిపాడు పంట కాలువ స్థలంలో ఇల్లు నిర్మాణం చేపడుతున్న యజమానిని పిలిపించి అనుమతి పత్రాలు తీసుకురావాలని సూచించారు. 27వ వార్డు రామలక్ష్మణ కాలనీ ఉలాసపేట వీధి చివర గల భద్రమ్మ కోనేరుకు ఆనుకొని రానాబందలో అక్రమ నిర్మాణం అవుతున్న ఇంటి ఆక్రమణ స్థలంలో ఉన్న కట్టడములను తొలగించారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందితో సమావేశమై పరిస్థితిని సమీక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గొప్పిలికి చెందిన నాగపు మహేష్ అనే విద్యార్థి ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందారు. విద్యార్థి కుటుంబం ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యంలో సర్పంచ్ పల్లి యోగి, గొప్పిలి, కరజాడ పాఠశాల సిబ్బంది, గొప్పిలి పాఠశాల విద్యార్థులు రూ.19,500 ఆర్థికసాయం సోమవారం అందించారు. ఈ మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి విద్యార్థి కుటుంబానికి అందజేశారు.

సంతబొమ్మాళి : మండలంలోని ఉదయపురానికి చెందిన వంకల సంజీవ్ కుటుంబానికి కెపి స్పందన ఫౌండేషన్ సభ్యులు రూ.పది వేలు ఆర్థికసాయం అందించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంజీవ్, ఆయన భార్య సరస్వతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆస్పత్రికి వెళ్లి బాధితులని పరామర్శించారు. వైద్య ఖర్చులకు తమ వంతు సహాయం అందించారు. ఫౌండేషన్ సభ్యులు షణ్ముఖ, సిమ్మన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం హైస్కూల్‌లో (1989-90)లో చదివిన పూర్వ విద్యార్థులు తమ ఔదార్యం చాటుకున్నారు. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా నవరంగాపూర్ బ్లాక్ అంబడోలాలో నివాసం ఉంటున్న తమ చిన్ననాటి మిత్రుడు రవిశంకర్ పాడి కుటుంబానికి ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకొని ఎంత దూరమైనా ఆలోచించకుండా తమ మిత్రునిని కలిసి ధైర్యం చెప్పాలనే ఉద్దేశంతో వెళ్లారు. ఈ సందర్భంగా రూ.30 వేలు వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మద్దిల హరినాథ్, బొడ్డేపల్లి మోహన్, కీలు లోకనాథం, జామి మధు, పుచ్చ అప్పలస్వామి పాల్గొన్నారు.



సంతబొమ్మాళి : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

కవిటి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆపదలో ఉన్న యువకునికి అండగా నిలిచిన మర్లపోలమ్మ స్వచ్ఛంద సంస్థ తన దాతృత్వాన్ని చాటుకుంది. మండలంలోని పెద్ద కపాసుకుద్దికు చెందిన కర్రి మేఘనాథ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు, వెన్నెముకకు గాయమైంది. వైద్యులు శస్త్ర చికిత్స కోసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. దీంతో మేఘనాథ్ కుటుంబం దాతల సహాయాన్ని కోరింది. ఈ విషయం తెలుసుకున్న కె.కపాసుకుద్దికు చెందిన మర్లపొలమ్మ తల్లి గ్రూప్ సభ్యులు స్పందించి తక్షణ సాయంగా రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న కృష్ణ

మంత్రిని కలిసిన కృష్ణ

ప్రజాశక్తి - సోంపేట

పలాస వచ్చిన ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మండలంలోని మామిడిపల్లికి చెందిన రామకృష్ణ ఛాటబుల్ ట్రస్టు చైర్మన్ కోదండ కృష్ణ ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కమ్యూనిటీ భవనం, ప్రైమరీ హెల్త్ కమ్యూనిటీ సెంటర్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు పుచ్చ ఈశ్వరరావు, కుత్తం లక్ష్మణ్, నూకల సోమేష్, దున్న వీరాస్వామి, దున్న కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న చిరంజీవి

టిబి వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఎక్కువగా పోషకాహారం లోపం వల్ల టిబి వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందని పాతపట్నం టిబి యూనిట్ సూపర్‌వైజర్ పొట్నూరు చిరంజీవి అన్నారు. మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇల్లయపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద టిబి ముక్తాభారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. టిబి వ్యాధిపై అవగాహన కల్పించి, వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌టిఎల్ఎస్ ఝాన్సీరాణి, సిహెచ్ఒ సంతోష్‌కుమార్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపిపి మురళి

సిసి రోడ్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నరసన్నపేట

మండలంలోని సత్యవరం పంచాయతీలో శ్మశాన వాటికకు సోమవారం ఎంపిపి ఆరంగి మురళి సోమవారం సిసి రహదారి పనులు ప్రారంభించారు. పంచాయతీ నిధులు రూ.3 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దూకలపాడు సర్పంచ్ అల్లు అసిరినాయిడు, సీర లక్ష్మీనారాయణ, నీలంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

ప్రజాశక్తి- నరసన్నపేట

శాసనసభ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ సభ్యునిగా బగ్గు రమణమూర్తి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సందర్భంగా టిడిపి కార్యకర్తలు టిడిపి కార్యాలయంలో సోమవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొద్దు చిట్టిబాబు, జామి వెంకటరావు, సాసుపల్లి కృష్ణబాబు, పోలాకి మండలం టిడిపి అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, సొసైటీ చైర్మన్ భౌరి భాస్కరరావు పాల్గొన్నారు.

మాధవరావుకు సత్కారం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మోటూరు హనుమంతరావు స్మారక మెమోరియల్ ఉత్తమ అవార్డుకు ఎంపికైన ఆంధ్రజ్యోతి మెళియాపుట్టి మండల విలేకరి మాధవరావును స్థానిక విలేకరులు సోమవారం ఆయన స్వగృహంలో దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఎంహెచ్ అవార్డుకు ఎంపిక కావడంపై అభినందనలు తెలిపారు. మరిన్ని ప్రజా దృక్పథ వార్తలు రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, చాణిక్య, భాస్కరరావు, మురళి, గూడ రామారావు, మాడుగుల వరప్రసాద్, డోల క్రాంతికుమార్, సోనాపురం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లం పంటపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

వెలుగు అసోసియేషన్ ప్రోత్సాహంతో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది అల్లంలో అధిక దిగుబడినిచ్చే మహిమ రకంపై హిరమండలం, కొత్తూరు మండలాల్లో రైతులకు అవగాహన కల్పించారు. భూతలగూడ, గెసరిగూడ, గొట్టిపల్లి, అడ్డంగి, బాపడుగుడ వంటి గిరిజన శిఖరాగ్ర గ్రామాల్లో అల్లం విత్తనాలను పంపిణీ చేశారు. గ్రామాల్లోని అల్లం రకం మహిమ పంట క్షేత్రాలను డాక్టర్ వి.హరికుమార్, కెవికె ఉద్యాన శాస్త్రవేత్త తగు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ ఏరియా కో-ఆర్డినేటర్ సవర ఆనందరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



శ్రీకాకుళం రూరల్ : వృద్ధురాలికి పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలం బైరి, కరజాడలో సోమవారం ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధిని వివరించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఎండు చిన్నారావు, వై.అమ్మనరావు, టిడిపి నాయకులు, మహిళా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పొందూరు: మండలం కృష్ణాపురంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు, యూనిట్ ఇన్‌ఛార్జి బాడాన శేషగిరి ఆధ్వర్యంలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి అంబల్ల శ్రీనివాసరావు, నాయకులు బాబూరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పొందూరు : సంక్షేమ పథకాలను వివరిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని ఉుకలాంలో బొడ్డు నరసయ్య, చోడి చిన్నయ్య కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరామర్శించారు. నరసన్నపేట పట్టణ ప్రధాన కార్యదర్శి లక్కోజు రామకృష్ణ తండ్రి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, కెవిఎల్ ప్రసాద్, మానికల సూర్యనారాయణ, గండేటి నాగభూషణ్, సేనాపతి కృష్ణారావు, బోయిన్ సతీష్, కోరాడ రామచంద్రరావు, వూన్న వెంకటేశ్వరరావు, తాళాభక్తులు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణదాస్...

నరసన్నపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ బురల్లి శంకర్ అన్నయ్య బూరల్లి ప్రసాద్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, మండల ఉప అధ్యక్షులు నేతింటి రాజేశ్వరరావు, వైస్ ఎంపిపి పాగోటి రాజారావు, సర్పంచ్ కనపల శేఖర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: విద్యార్థులను ఉత్తములగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. టిడిపి కార్యాలయంలో నరసన్నపేట నియోజకవర్గంలో బిసి, ఎస్‌సి వెల్ఫేర్ వార్డెలతో అడ్వయిజరీ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ తమ హాస్టళ్లల్లో చదువుతున్న విద్యార్థులను తమ పిల్లలుగా భావించి, విద్యపరంగా వారికి ఉత్తమ మార్గదర్శనం కల్పించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విశ్వాసంతో హాస్టళ్లకు పంపుతారని అన్నారు. విద్యాబుద్ధులతో పాటు భద్రత కూడా అందాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వసతులు, పుస్తకాలు, ఆహారం, దుస్తులు సక్రమంగా అందించాలన్నారు. హాస్టళ్ల మరమ్మతులకు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- లావేరు

గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని రణస్థలం ఎడిఎ వడ్డాది శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తాళ్లవలస రైతు సేవా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఎన్ఎంఎన్ఎఫ్ కార్యక్రమంపై మూడురోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా చివరిరోజు సోమవారం ప్రకృతి వ్యవసాయ విధానం, ప్రకృతి వ్యవసాయ ఉపయోగంపై ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో చేపట్టాల్సిన విధానాన్ని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ప్రస్తుతం ఏవిధంగా జరుగుతుంది, ఏ విధంగా చేయాలనే విషయాన్ని గ్రామస్థాయిలో రైతులకు అర్థం అయ్యేలా వివరించాలన్నారు. ఎన్ఎఫ్ఎ గోవిందరెడ్డి మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలు నిర్వహించే విధానాన్ని వివరించారు. ప్రతి రైతు 365 రోజుల పాటు కూరగాయలు ఏ విధంగా పండించాలో వివరించారు.



లావేరు : మాట్లాడుతున్న ఎడిఎ శ్రీనివాసరావు

కార్యక్రమంలో డిఎంఎంటి రాంబాబు, జిల్లా ట్రైనింగ్ టీమ్ సభ్యుడు రవికృష్ణ, రాంబాబు, సంతోష్ కుమార్, శ్రీనువాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తూరు : మాట్లాడుతున్న ఎడి రాజగోపాల్

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల డేటాను ఈ పంటలో నమోదు చేయించేలా సిబ్బంది చూసుకోవాలని ఎడి రాజగోపాల్ అన్నారు. మండలంలో రైతు సేవా కేంద్రం యూనిట్ ఇన్‌ఛార్జిలకు ఎంటి సూర్యనారాయణ ఆధ్వర్యాన సోమవారం శిక్షణ ఇచ్చారు. ఎటిఎం మోడల్, ఎ-గ్రేడ్ మోడల్, 365 రోజులు పంటలు, కూరగాయలు నమూనాల గురించి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన పంటలు మార్కెటింగ్ చేసుకోవడానికి వీలుగా ఉందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎఒ స్వర్ణలత, విఎఎలు విహెచ్ ఎ.దివాకర్, నవీన్, డిఎంఎంటిలు వెంకటేశ్వరరావు, సురేష్, యూనిట్ ఇన్‌ఛార్జీలు రవి, చిన్నమ్మి, గోవిందరరావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట మిలీనియం లయన్స్ క్లబ్ కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. విభిన్న సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు, ఒకేసారి 20 మంది నూతన సభ్యులను చేర్పించటం క్లబ్ చరిత్రలో రికార్డని అన్నారు. నూతన అధ్యక్షునిగా తంగుడు రత్నకుమార్, కార్యదర్శిగా పొట్నూరు రమేష్, కోశాధికారిగా, కాసిన రమేష్‌లు ప్రమాన స్వీకారం చేశారు. గత కార్యవర్గ అధ్యక్షులు రమణ సాహు, కె.సాయిరాం, పి.రమేష్‌లు నూతన కార్యావర్గానికి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో డి.వి.ఎస్.వర్మ, కె.సుబ్బారావు, ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ కృష్ణమోహన్, వి.ఎం.రావు, ఊన్న సోమేశ్వరరావు, డాక్టర్ గోలివి మోహన్ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

బివికె విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కవిటి

విజయనగరంలో భారతీయ విద్యా కేంద్రం నిర్వహించిన సంభాగ్ స్థాయి ఖేల్ కూద్ పోటీల్లో కవిటి బివికె పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభను ప్రదర్శించి పలు క్రీడల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. పాఠశాలకు చెందిన చైత్ర, అక్షయ, వికాస్, హరీష్‌లు హైజంప్, షార్ట్ పుట్, డిస్క్ త్రో, కబడ్డీ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి ఆగస్టు 9, 10 తేదీల్లో నిర్వహించనున్న సమితి స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అనిల్ తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బల్లెడ కృష్ణారావు, దాసప్ప, జానకిరామయ్య, శిరీష, మాడి కమ్మ సుహాసిని, జ్యోతి, కృష్ణకుమార్, లక్ష్మి అభినందించారు.



పట్టుకున్న పశువులు

పశువులు పట్టివేత

ప్రజాశక్తి - రణస్థలం


ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి విశాఖపట్నం వైపు కబేలాకు పెద్దఎత్తున 21 పశువులను తరలిస్తున్న ఐచర్ వ్యాన్‌ను 16వ నంబర్ జాతీయ రహదారి పైడిభీమవరం చెక్‌పోస్ట్ వద్ద జె.ఆర్.పురం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఐచర్ వ్యాన్‌ను సీజ్ చేశారు. పట్టుకున్న పశువులను గోశాలకు తరలించామని ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా పశువులను లారీల ద్వారా అక్రమంగా తరలిస్తే అటువంటి వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పశువులను తరలిస్తున్నారని ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మలకు నివాళి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకులు, మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ అగర్వాల్ సతీమణి నిర్మల్ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు పాఠశాల కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణ అధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యాన పాఠశాలలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నిర్మల్ అగర్వాల్ పేదల అభ్యున్నతికి, వారి జీవితాల్లో వెలుగు నింపేందుకు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ రమణమూర్తి, ప్రధానోపాధ్యాయులు రషీదా సుల్తాన్, అదనపు పరిపాలన అధికారి సయ్యదాసుల్తాన్, ట్రాన్స్‌ఫోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే...



మాట్లాడుతున్న గోవిందరాజులు


కోటబొమ్మాళి: గడిచిన సంవత్సర కాలంగా కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేకే వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కళింగకోమట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నంలోని విలువైన భూములను కూటమి ప్రభుత్వం తన అనపుచర రియల్ ఎస్టేట్‌కు ధారదత్తం చేస్తున్నారని ఆరోపణలు చేయడం హాస్యాస్పందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి పాలనలో అనేక రంగాలు అభివృద్ధి చెందుతుందన్నారు. మూలపేట పోర్టు, విశాఖరైల్వే జోన్, ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు వేగవంతమవుతున్నాయని అన్నారు.



సురేష్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

సురేష్‌కి అభినందనలు

లావేరు: లావేరు టిడిపి మండల అధ్యక్షునిగా ఇటీవల తొమ్మిదోసారి ఎన్నికైన ముప్పిడి సురేష్‌ను మురపాక పంచాయతీ టిడిపి నాయకులు జల్లేపల్లి జనార్దనరావు, తూగిటి జోగరావు మాస్టార్, లక్ష్మణరావులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కష్టపడి పనిచేసే వ్యక్తి సురేష్ అని అన్నారు.



సన్మానిస్తున్న ఫాస్టర్లు

ప్రదీప్‌కు సన్మానం

ఇచ్ఛాపురం: వైసిపి నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షునిగా గువ్వాడ ప్రదీప్ కుమార్ ఇటీవల నియమితులయ్యారు. దీంతో ఫాస్టర్ ఫెలోషిప్ సోమవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ వైసిపి బలోపేతానికి మరింత కృషి చేస్తానని అన్నారు. ఇప్పటికే వార్డు కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న తనకు కొత్తగా నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డికి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయా, జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఫిలోసిప్ అధ్యక్షుడు ప్రభుదాస్ పాస్టర్, సెక్రెటరీ సుందరావు తదితరులు పాల్గొన్నారు.

స్టాలిన్‌కు పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న స్టాలిన్

టెక్కలి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు, అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయులు దూసి ఆంధ్రాస్టాలిన్ కవితా పురస్కారాన్ని అందుకున్నారు. విశాఖపట్నానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన 150 కవులకు సోమవారం సాహితీ పట్టాభిషేకం పేరుతో సత్కరించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో స్టాలిన్ ఎంపికకయ్యారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన 527 మంది వీరసైనికులకు నివాళ్లర్పిస్తూ... స్టాలిన్ రాసిన కవితకు ఈ పురస్కారం లభించింది. స్టాలిన్ అవార్డు అందుకోవడంపై టెక్కలి ప్రజా చైతన్య కళాసమితి అధ్యక్షులు ఉత్తరకవాటం గణపతిరావు, నిర్వాహకులు చిలుకు కృష్ణారావు, మూల తాతయ్య, అనిశెట్టి చిట్టెన్న, బమ్మిడి కృష్ణారావు, మల్లారెడ్డి పద్మనాభం, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రోణంకి రామ చంద్రరావు, డి.వీరాస్వామి, కోరాడ మోహనరావు, సాహిత్య సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు జి.వి.రెడ్డి మాస్టార్, బొడ్డ అయ్యబాబు అభినందించారు.